# మరణ వాంగ్మూలం

**-జాతశ్రీ**

హైద్రాబాద్...

ఇంటర్నేషనల్- 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' లో... ఎంపిక చేయబడిన యువ పారిశ్రామిక వేత్తలూ, విద్యార్థులూ కలిసి, 'అణు ఒప్పందపు నేపథ్యంలో ఇండో-అమెరికన్ సంబంధాలపై సంధిస్తున్న పలు ప్రశ్న లకు అమెరికా అధ్యక్షులు- శ్రీ జార్జి డబ్ల్యు.బుష్ చాలా తాపీగా, చాలా, చాలా 'హ్యాపీ'గా సమాధానాలిస్తున్నారు.

వారి మొహంలో తొణికిసలాడే పరిమితానందానికి ఉబ్బితబ్బిబ్బవుతూ- రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సభ్యులు కొందరు ఓ ప్రక్కగా చేతులు కట్టుకొని, ఒదిగి నిల్చొని... అపరిమితంగా సంబరపడిపోతున్నారు.

ఐతే...

అధ్యక్షుని చుట్టూ పహరాగా నిలుచున్న వారి ఆంతరంగిక భద్రతా సిబ్బంది మొహాల్లో ఆనందం లేదు. ఆందోళన ఉంది. అభయం లేదు. చెప్పుకోడానికి సిగ్గేసేంత అభద్రతా భావం ఉంది. చీమ చిటుక్కుమన్నా బెంబేలెత్తుతూ నలుదిక్కులా డేగ కళ్లతో పరిశీలనగా చూస్తున్నారు.

ఆ భద్రతా సిబ్బంది కనుసైగల్ని అందుకోగల దూరంలో... 'అమెరికన్ సీక్రెట్ సర్వీస్' అధికారులు తమ ఎడమ మణికట్టుల కమర్చుకొన్న మైక్రోఫోనుల్లో- నగరం నలు చెరగుల్నుంచి వస్తున్న సంకేతాలను 'డీకోడ్' చేసి, సమన్వయ పర్చుకొంటూ... కాకి 'కావ్' మన్నా కంగారు పడిపోతున్నారు.

ఆ దూరానికి మరికాస్త దూరంలో... 'అమెరికన్ సీక్రెట్ సర్వీస్' సిబ్బంది- అత్యంత శక్తివంతమైన బైనాక్యులర్స్‌తో భూమినీ, ఆకాశాన్నీ అనుమానంతో శోధిస్తూ... రెల్లు కదిలినా రెచ్చిపోతూ పరుగులు పెడుతున్నారు.

ఆ మరికాస్త దూరానికి ఇంకాస్త దూరంలో.. జర్మన్ షఫర్డ్‌లూ, లాబ్రెడార్‌లూ- అక్కడ కదిలే కనిపించే- ప్రతి 'భారతీయుణ్ణీ'.. అదోలా మూతిపెట్టి, మురక జూస్తున్నాయి. ఆ కుక్కల్ని కుక్కలనకుండా- సార్జెంట్, మేజర్, లెఫ్టినెంట్, కల్నల్ తదితర సైనిక పదాలతో సంబోధిస్తున్నారు.

ఆ ఇంకాస్త దూరానికి మరీ దూరంగా- అనగా కుక్కల కావల ఓ పదిగజాల దూరంలో... భారతీయ బ్లాక్ కమెండోలు నల్లని సివంగుల్లా కదులుతున్నారు. ఆ పై వలయంలో అత్యంత కఠినమైన శిక్షణలో రాటుతేలిన 'రాపిడ్ యాక్షన్ ఫోర్స్' చేసే యాక్షన్ మరీ వింతగా ఉంది. ఆయుధ వ్యాపారికే తెలియని రకరకాల సరికొత్త ఆయుధాల్ని చేబూని చేసే హంగామా చూస్తుంటే సామాన్యునికి దడ పుట్టుకొస్తుంది.

చివరగా... ఎంపిక చేయబడిన రాష్ట్ర పోలీసులు తమ జాతీయుల నుంచి- ఒక అమెరికన్ జాతీయునికి ఏదేని ప్రమాదం ముంచుకొస్తుందేమో..నని, ముందు చూపుతో దారిన వెళ్లే ప్రతి చిన్నా చితకా భారతీయునితో సహా ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తున్నారు.

**భళారే-విచిత్రం...**

ఒక 'అనుకూలత'కు కొన్ని 'ప్రతికూలతలు' ఉండటం ప్రజాస్వామ్యమైతే... మన భారతదేశమూ ఒక విశాల మైన ప్రజాస్వామ్యదేశమే!

❍ ❍ ❍

అమెరికా అధ్యక్షునికి విశిష్ట అధికార లాంఛనాలతో ఆహ్వానం ఎంత ఘనంగా జరిగిందో... అంతే గొప్పగా నిరసన ప్రదర్శనలూ జరిగాయి.

'సుందరయ్య విజ్ఞాన కేంద్రం' నుంచి భారీ సమీకరణతో బ్రహ్మాండమైన నిరసన ప్రదర్శన! పాతబస్తీలో 'లాడెన్ అభిమాన సంఘం' రెచ్చిపోతూ రౌద్ర నిరసన ప్రదర్శన! ఓయూ క్యాంపస్‌లో నినాదాల గుంపు! ఇందిరా పార్కు దగ్గరో నిరసనల హోరు! ఇంకా నగరం నలుచెరగులా చిల్లర మల్లర ఆందోళనలు, ఊరేగింపులు!!

బుష్-గో బ్యాక్! సామ్రాజ్యవాదీ- ముర్దాబాద్! యుద్ధాలను ప్రేరేపించేవాడా... వెనక్కి వెళ్లిపో! శాంతిని కబళిస్తున్నవాడా... ఖబర్దార్! బహు- బాగోతాల కోవిదుడా... డౌన్, డౌన్!

హుస్సేన్ సాగర్ చెరువు కట్ట మీద- బారులు తీరిన వైతాళికుల నీడలో, తథాగతుని ఆశీర్వాదాలతో వంద మందితో ఆరంభమైన ఓ నిరసన ప్రదర్శన- మరో గంటకే వందలుగా పెరిగిపోయింది. లారీల్లో జనం తేబడ్డారో, స్వయంగా వచ్చారో గాని... కొందరి చేతుల్లో నల్ల జెండాలు, కొందరి మూతులకు నల్ల

రిబ్బన్లు, కొందరి– నొసళ్లు, దండచేతులు, ఛాతీ భాగాల్లో ఎక్కడో ఓ చోట– నలుపు కనిపిస్తూంది. స్వామి అయ్యప్ప దీక్షాధరుల్లా ఒహరిద్దరున్నారు.

ఊరేగింపు సాగుతూంది.

ఊరేగింపు మధ్యలో ఓ ట్రాక్టరుంది. దానికి నలు మూలలా నల్లని జెండాలు! మధ్యలో ఆరడుగుల దిష్టి బొమ్మ! దాని తలపై ఎగురుతూ అమెరికన్ జాతీయ పతాక!

ఎండ ఉధృతంగా ఉంది. ఊరేగింపు ఎండలా మండిపోతూంది. ఉద్రేకాల నినాదాలతో, నిరసన ధ్వనులతో నగరం దద్దరిల్లిపోతూంది.

"ఏమిటీ రగడ? ఎందుకీ రభస?"

"అతనొచ్చాడు!"

"అలానా!... నా కిప్పటి వరకూ తెలీదు స్మీ... పద!"

"పద... పద..."

"పరుగులా, వరదలా, పగబట్టిన రీతిలా– పద"

"జై"

–జోరు మీదున్న జనం! హోరులా జనం! ఉత్తుంగ తరంగంలా జనం! ఉద్వేగాల జనం!

ఊరేగింపు ఉద్రేకంగా సాగుతూ, ఉత్సాహంగా ఆగుతూ... "కరో... కరో– బంద్ కరో...!"

–దుకాణాలూ, బ్యాంకులూ మూతపడ్డాయి. ఆర్థిక, వ్యాపార లావాదేవీలన్నీ ఆగిపోయాయి. కార్యార్థులు తలలు పట్టుక నష్టాలు గుణించుకోసాగారు.

"కరోరే.. బంద్ కరో..."

–బస్సులూ, ఆటోలూ ఆగిపోయాయి. ప్రయాణికులు అవాక్కయిపోయారు. పాఠశాలలూ, ఆస్పత్రులూ, కార్యాలయాలూ, కార్ఖానాలూ... మూసుకొన్నాయి. పబ్బులకేసీ, పార్కులకేసీ పోయినవారు పోను, మిగిలినవారు ఊరేగింపులో సమిధలయ్యారు.

"బంద్, సాలా బంద్"

–ప్రజా జీవితం బంద్! ప్రజాభిప్రాయాలూ బంద్! ప్రాణాంతక అవసరాలూ బంద్!

ప్రజా ఆక్రోశం పళ్లు కొరుక్కోబోయి, నాలిక కొరుక్కుంది.

"చెప్పా చెయ్యకుండా యిదేందన్నా?"

"డూటీలు చెయ్యనీయకుండా యిదంతెందుకన్నా?"

"సామ్రాజ్యవాది మన సిటీ కొచ్చిండు. నిరసనగా 'జులుస్'!"

"ఏం సామ్రాజ్యవాదో... 'నాగా' అయితే జీతం కోస్తుడు మా ఓనర్"

"నేనొస్తా 'జులుస్'కి. బిరియాని పొట్లం యిస్త రుగా?" అడ్డా మీద కూలి దొరకని ఓ నకనకలాడే నరాకారపు ఆశ.

"ఊ.. పద"

ప్రధాన వీధుల గుండా ఊరేగింపు.

"బంద్... బంద్... బంద్ కరో!"

వీధుల రెండు ప్రక్కలా ఉన్న దుకాణాల షట్టర్స్ దింపేస్తున్నారు.

చౌరస్తా నలువీధుల నుంచి జనాలు... జలల్లా, జలగల్లా... ఆ జనాలతో పాటు ముసుగేసుకు వచ్చి కలిసిన కర్రలూ, కత్తులూ... ఆవేశాలూ, కావేషాలూ... ఉత్సాహాలూ, ఉద్రేకాలూ... ఉన్మాదంలా రూపెత్తడానికి ఆయత్తపడుతున్నాయి.

ఎండ– ఉధృతంగా వుంది! ఎండ ఊరేగుతు న్నట్టుగా ఉంది.

## నయనాలు

ప్రేమ పెదవి దాటనప్పుడు
నయనాలు ప్రణయ 'కవనాలు!'
మౌన మనోప్రాంగణంలో విచ్చుకునే
కిరణాలు!
హృదయాల మధ్య అలౌకిక మాధ్యమాలు!
శలాబ్దాల స్తబ్దతను ఛేదించే
పురాతన ప్రేమకు అనంత భాష్యాలు!

## జ్ఞాపకం

పొరలు పొరలుగా
అనుభవాలు
అనుభవాలే అనుభూతుల / జ్ఞాపకాలు!
గుబాళించే జ్ఞాపకాలు గులాబీలు!
వెంటాడే జ్ఞాపకాలే కంటకాలు!
కంటకాల్ని దాటి గులాబీలను
చేరుకోవాలి!
జీవన సంధ్యా సమయంలో
జ్ఞాపకాల బడిలో సేదతీరుతుంది జీవితం!
జీవితం జ్ఞాపకాల రసాతలం!

–ఎం. వీరేశ్వరరావు

ఉత్తేజిత ప్రసంగాలతో, గారడీ మాటలతో ప్రదర్శన ఆరంభించిన నేతలు– అంతందాకా ఉండే పరిస్థితి ఎంతమాత్రమూ లేదు. వృద్ధాప్యమూ, మధుమేహమూ, రక్తపోటూ... రేపటికి మిగలమేమో నను భయంతో ఊరేగింపును అనుచరుల కప్పగించి, వెనక్కి తగ్గారు.

నాయకులే తప్పుకున్నప్పుడు... మనమేనా తక్కువ? అని ప్రశ్నించుకొన్న అనుచరులూ ప్రక్కకు జరిగి 'ప్రైవసీ'ల్లోకి జారుకొన్నారు.

నాయకులు లేరు, అనుచరులనబడు ఉపనాయకులూ లేరు. అవగాహన గలవారూ, అభిమానం గలవారూ లేరు. ఊరేగింపు ఉంది!

ఊరేగింపుతో పాటు బిక్కుబిక్కుని పోలీసులున్నారు గాని, 'బాస్'లు మాత్రం వెనక్కి తగ్గిన నాయకుల వెనుకే వెన్ను చూపారు.

ఊరేగింపులో ఉత్సాహం, ఉద్రేకం! కేకలతో, అరుపులతో దద్దరిల్లిపోతూంది!

"బాబూ, పురుటి బిడ్డ... కక్కటిల్లిపోతూంది. ఓ పాల ప్యాకెట్...!"

"వెళ్లవయ్యా... వెళ్లూ... ఇప్పుడేం యివ్వరు."

"నా ప్రయాణం ఆగిపోతే నా కూతురు ఆత్మహత్య..."

"నా భర్త చావు బతుకుల్లో... హాస్పటల్‌కెళ్లాలి."

"–ఏం తమాషాగా ఉందా? 'బంద్' అని తెలీదా?"

ఊరేగింపు– ఊరేగుతూనే ఉంది. ఊరేగింపు నిన దించీ, నినదించీ.. గొంతెండిపోదూ?... పోయింది!

దాహం!

కూల్‌డ్రింక్ షాపులో మినరల్ బాటిల్స్ ఖాళీ! సోడాలూ డిటో! కూల్‌డ్రింకుహ్లూ... దూ, దూ...

బొటాబొటిగా బతుకునీడ్చే వ్యాపారి జీవితం దూ.. దూ...

"సామ్రాజ్యవాదీ– డౌన్ డౌన్! బుష్– గో బ్యాక్!"

పోలీసతని మొహంలో తారాడిన నవ్వు! "అతను 'బ్యాకై' అరగంటయింది"

"ఐతైందు.. నువ్ గమ్మునుండి, నీ డూటీ నువ్ చెయ్."

విసురుగా కంకర రాయి– విల్లంబు వేగంతో పోలీసతని ముక్కును తాకింది. బొట బొటా రక్తం!

మిగతా పోలీసులు తేరుకునేంతలో కవ్వింతలా మరో రాయి! పోలీసులు తుల్లింతకు లోనై పోతుంటే మరోటి... మరో... మ... రాళ్ల వర్షం!

తప్పించుకొంటూ పోలీసుల పరుగులు! సమయానుకూల ఆదేశాలు యిచ్చే అర్హతగల వాళ్లెవరూ ఆ పరిసరాల్లో లేరు!

బతుకు జీవుడా! పరుగు...

"పోలీసుల పనైపోయింది... తర్వాత?"

"రెడీ... వన్, టూ, త్రీ..."

కర్రలు, కత్తులు ముసుగులు విడిచి

ఆవేశకావేషాలూ ఉరకలెత్తుచూ...

లూటీ... లూటీ... లూటీ!

కనిపించే ప్రతి దుకాణం లూటీ! మూసివున్న షట్టర్స్ తొలగిస్తూ– ఎగబడుతూ, జొరబడుతూ... ఖరీదైన ప్రతి దుకాణం లూటీ! విలువైన ప్రతి వస్తువూ లూటీ...

... ... ...

"ఏం జరుగుతూంది?"

"లూటీ..."

"ఎందుకు జరుగుతూంది?"

"సామ్రాజ్యవాది వచ్చిండు!"

"వస్తే?..."

"అతనో ప్రమాదకారి. అతని రాకకు నిరసన తెలుపుతున్నాం"

"దుకాణాలు లూటీ చేస్తూనా? ప్రజా జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తూనా? ప్రజల ఆస్తుల్ని నాశనం చేస్తూనా? అరాచకాన్ని అంగీకరిస్తూనా? నీ దేశాన్ని నువ్వు తగలబెట్టుకుంటూనా?"

"పోరా, పో... దేశద్రోహి!"

"ఎయ్యండహె... మాలావు మాట్లాడ్తండు."

"సూస్తరేంది..., ఇస్వంటోళ్లుండబట్టే..."

–అనడం ఆలస్యం! ఉద్రేకాల ఉన్మాదం ఆలోచిస్తుందా? ఆగుతుందా?"

❍❍❍❍

ఉస్మానియా– ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ సగటు భారతీయుడు– "నాయకుల కొరకు నాయకుల వలన, నాయకుల చేత– ఏర్పడిన 'అనుకూలతా ప్రజాస్వామ్యం'లో– హద్దు మీరిన 'ప్రతికూలతా ప్రజాస్వామ్యాన్ని' నేను! నా మరణానికి ఎవరి ప్రమేయమూ లేదని చెప్ప దం నిశ్చయంగా ఆత్మవంచనే!

అయినా– అరవై ఏళ్లుగా వంచనకు గురౌతున్న మన 'ప్రజాస్వామ్యం' ముందు నా ఆత్మవంచనేపాటిది? ఈ మరణ వాంగ్మూలం ఏపాటిది?

నా ప్రియమైన భారతదేశమా... న...మ...స్తే!" ■